సాక్షి
ఖమ్మం

శుక్రవారం । 27 । జూన్ । 2025



రక్తమోడుతున్న రోడ్లు

జిల్లాలోని ప్రధాన రహదారులపై రోజూ ఎక్కడో ఓ చోట ప్రమాదాలు జరుగుతుండగా పలువురు మృత్యువాత పడుతున్నారు. 8లో



ఎర్రజెండాలన్నీ ఏకమైతే..

ఎర్రజెండాలన్నీ ఏకతాటిపైకి వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు వెల్లడించారు. 8లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
34° / 26°

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. చాలాచోట్ల ఆకాశం మేఘావృతమై వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

జమలాపురం హుండీ ఆదాయం రూ.41.23 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. దేవాదాయ శాఖ పరిశీలకుడు ఎం.అనిల్‌కుమార్, ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు సమక్షాన లెక్కింపు చేపట్టగా 95రోజులకు గాను రూ.41,23,546 ఆదాయం నమోదైంది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ ఎస్.విజయకుమారి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మతో పాటు శ్రీసత్యసాయి సేవాసమితి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైసెట్‌లో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ఖమ్మంరూరల్: రూరల్ మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డులో ఉన్న తరుణి హాట్‌లోని రైసెట్ ద్వారా నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ తెలిపారు. మహిళలకు టైలరింగ్‌లో, యువకులకు సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్‌లో శిక్షణ త్వరలో మొదలవుతుందని వెల్లడించారు. టైలరింగ్ శిక్షణకు ఈనెల 30వరకు, సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్ కోర్సు కోసం జూలై 7వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణా కాలంలో ఉచితంగా వసతి, భోజనం సమకూర్చడమే కాక యూనిఫామ్, టూల్‌కిట్స్ అందిస్తామని తెలిపారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఉద్యోగి

ఖమ్మం సహకారనగర్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం ప్రారంభమైంది. ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల్లో తొలిరోజు 286 మంది స్లాట్ బుక్ చేసుకోగా, 240మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారని పేర్కొన్నారు. ఈ కౌన్సెలింగ్ 29వ తేదీ వరకు కొనసాగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

టీఎన్జీవోస్ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు స్థానం

- రాష్ట్ర కార్యదర్శులుగా బాలకృష్ణ, జైపాల్



గంగవరపు బాలకృష్ణ



జెడ్ఎస్.జైపాల్

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా నాయకులకు చోటు దక్కింది. హైదరాబాద్‌లో గురువారం జరిగిన టీఎన్జీవోస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జిల్లాకు చెందిన గంగవరపు బాలకృష్ణ, జెడ్ ఎస్.జైపాల్‌ను రాష్ట్ర కార్యదర్శులుగా ఎంపిక చేశారని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదన శ్రీనివాసరావు వెల్లడించారు. రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించడపై కేంద్ర అధ్యక్ష కార్యదర్శులు మారం జగదీశ్, ముజీబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు కొమరగిరి దుర్గాప్రసాద్, యర్రా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి ప్రమాణాలు మెరుగుపడాలి

రఘునాథపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతీ విద్యార్థి విద్యాప్రమాణాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. రఘునాథపాలెం మండలం రాంక్యాతండాలోని ప్రాథమిక పాఠశాలను గురువారం తనిఖీ చేసిన ఆమె మాట్లాడారు. తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక దృష్టి సారించాలని, వారిని అందరితో సమానంగా నిలబెట్టేలా బోధనా పద్ధతుల్లో మార్పులు చేసుకోవాలని తెలిపారు. పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా బోధించడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. పాఠ్యాంశాల బోధనతో పాటు మానవీయ విలువలు, ఆచరణాత్మక నైపుణ్యాలు కూడా నేర్పాలని అదనపు సూచించారు.

ఓవైపు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలన్న ఆరాటం.. మరోవైపు తమకు పట్టు ఉన్న గ్రామం, వార్డు రిజర్వేషన్ ఎలా ఉంటుందోనన్న ఆందోళన.. వెరసి ఆశావహులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మరో మూడు నెలల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యాన గ్రామాల్లో చర్చ ఊపందుకుంది. జీపీలతో పాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణపైనా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలియడంతో గ్రామం మొదలు మండల స్థాయి నేతల వరకు దృష్టి సారించి రిజర్వేషన్లపై అంచనాల్లో నిమగ్నమయ్యారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



రిజర్వేషన్లపైనే అందరి ఆసక్తి!

త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు

- గ్రామస్థాయిలో పట్టు నిరూపణకు ఆశావహుల యత్నం
- రిజర్వేషన్ల ఖరారు తర్వాతే స్థానం తేల్చుకోవాలని భావన

వాయిదాలు పడుతూ..

2019 ఏడాదిలో 584 గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించగా.. ఆ ఏడాది ఫిబ్రవరి 2న పాలకవర్గాలు పగ్గాలు చేపట్టాయి. వీరి పదవీ కాలం 2024 ఫిబ్రవరి 1న ముగిసింది. దీంతో 16 నెలల నుంచి జీపీలు ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం, ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుండగా.. రిజర్వేషన్లు ఖరారు కాకపోవడంతో వాయిదా పడుతూ వస్తోంది. ఇటీవల కోర్టు మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహించాలని తీర్పు ఇవ్వడంతో ఆ దిశగా ప్రయత్నాలు మొదలయ్యాయి.

రిజర్వేషన్ల చిక్కుముడి

పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిశాక ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా వార్డులు, సర్పంచ్‌ల రిజర్వేషన్ల మార్పుతో సాధ్యం కాలేదు. 2019 ఎన్నికల సందర్భంగా అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామపంచాయతీ చట్టం–2018ను తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం చేసిన రిజర్వేషన్లు పదేళ్ల పాటు కొనసాగాలి. అంటే ఈసారి కూడా అవే రిజర్వేషన్ల ప్రకారం నిర్వహించాల్సి ఉంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించడంతో రిజర్వేషన్లు మార్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంకోపక్క జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల ఖరారుపై బీసీ కమిషన్ కసరత్తు చేస్తోంది. చట్టసభలో బిల్లు ఆమోదం పొందడంతో రిజర్వేషన్ల మార్పు అనివార్యం కానుండగా.. ఈ ప్రక్రియ ఆలస్యం కారణంగా ఎన్నికలు వాయిదా పడుతూ వస్తున్నాయి.

నెలరోజుల్లో తేలనున్న లెక్కలు

కోర్టు తీర్పు నేపథ్యాన వచ్చే నెలరోజుల్లో వార్డులు, సర్పంచ్‌ల రిజర్వేషన్లు ఖరారు కానున్నాయి. జిల్లాలో మొత్తం 589 గ్రామపంచాయతీలు ఉండగా.. గత ఎన్నికల్లో 584 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఇటీవల ఏదులాపురం, కల్లూరు మున్సిపాలిటీలు కొత్తగా ఏర్పడ్డాయి. వీటిలో విలీనమైన జీపీలు మినహాయిస్తే 571పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో సర్పంచ్‌లు, వార్డు మెంబర్ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారయ్యాక గ్రామాల్లో రాజకీయాలు వేడెక్కనున్నాయి.

ఆ ఎన్నికలపై కూడా..

కోర్టు తీర్పుతో త్వరలోనే జీపీ ఎన్నికలు జరగనుండగా.. ప్రభుత్వం జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు సైతం నిర్వహిస్తుందని తెలుస్తోంది. జిల్లాలోని 289 ఎంపీటీసీ స్థానాలకు 2019 మే నెలలో ఎన్నికలు జరగ్గా.. పాలకవర్గాల గడువు తీరిపోయింది. అయితే ప్రస్తుతం ఎంపీటీసీ స్థానాలను పునర్విభజన చేశారు. ఖమ్మంరూరల్ మండలంలోని పది గ్రామపంచాయతీలు కొత్తగా ఏదులాపురం మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. మరో రెండు గ్రామపంచాయతీల పరిధిలోని కొన్ని గ్రామాలను సైతం కలిపారు. దీంతో అక్కడ రెండు ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. మరోవైపు రఘునాథపాలెం మండలం నుంచి మూడు జీపీలు ఖమ్మం రూరల్‌లో కలవడంతో ఈ మండలానికి ఒక ఎంపీటీసీ స్థానం అదనంగా వచ్చింది. అలాగే, ఎంపీటీసీ స్థానాల పునర్విభజనతో కొత్త స్థానం ఏర్పడింది. అంతేకాక కల్లూరు మున్సిపాలిటీ ఏర్పాటుతో ఐదు ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. ఇవి మినహా మిగిలిన ఎంపీటీసీ స్థానాలతో పాటు 20 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

గత ఎన్నికల్లో గ్రామపంచాయతీల రిజర్వేషన్లు

మొత్తం గ్రామపంచాయతీలు	584
షెడ్యూల్ ఏరియా జీపీలు	99
ఎస్టీ మహిళ	50
ఎస్టీ జనరల్	49
నూరు శాతం ఎస్టీ జీపీలు	11
ఎస్టీ మహిళ	06
ఎస్టీ జనరల్	05
నాన్ షెడ్యూల్ ఏరియా జీపీలు	237
ఎస్టీ మహిళ	29
ఎస్టీ జనరల్	30
ఎస్సీ మహిళ	60
ఎస్సీ జనరల్	60
బీసీ మహిళ	29
బీసీ జనరల్	29
అన్ రిజర్వుడ్ జీపీలు	237
మహిళలు	118
జనరల్	119

ఏం జరగనుందో..

గ్రామపంచాయతీల్లో వార్డులు, సర్పంచ్‌ల రిజర్వేషన్ల మార్పుతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. గత ఎన్నికల నాటి రిజర్వేషన్లలో కాస్త మార్పు ఉంటుందా.. సమూలంగా మార్పులు వస్తాయా అనే చర్చ సాగుతోంది. బరిలో నిలవాలనుకునే అభ్యర్థులు ఇప్పటికే కసరత్తు ప్రారంభించిన నేపథ్యాన రిజర్వేషన్ల అంశంపై చర్చ జోరుగా సాగుతోంది. సర్పంచ్ పదవికి బరిలో ఉండాలనుకునే నేతల్లో ఈ ఆందోళన ఎక్కువగా ఉంది. ఎంచుకున్న వార్డు లేదా సర్పంచ్ స్థానానికి గెలిచే అవకాశమున్నా ఎవరికి రిజర్వు అవుతుందో తేలకపోవడంతో అది ఖరారయ్యాకే పోటీ చేయడమా కుటుంబీకులను రంగంలోకి దించడమా నిర్ణయించుకోవాలనే భావనలో ఉన్నారు.

మున్నేరు, ఆకేరు బ్రిడ్జిలపై ఫ్లడ్‌గేజ్ స్టేషన్లు

ఖమ్మం అర్బన్: మున్నేరుకు వచ్చే వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ముంపును గుర్తించేలా జలవనరుల శాఖ అధికారులు తాత్కాలికంగా ఫ్లడ్‌గేజ్ స్టేషన్ల ఏర్పాటుకు నిర్ణయించారు. మున్నేరు ఉప్పొంగి ఖమ్మంపై ప్రభావం చూపకముందే వరద స్థాయిని అంచనా వేసేందుకు ఇవి ఉపయోగపడతాయని చెబుతున్నారు. ఈ క్రమంలో పోలిశెట్టిగూడెం వద్ద బ్రిడ్జితో పాటు తంగెళ్లపల్లి వద్ద ఆకేరు వంతెనపై ఒక్కో స్టేషన్ ఏర్పాటుకు అధికారులు పాయింట్లను గుర్తించారు. నాయుడుపేట నుండి ఈ ఫ్లడ్‌గేజ్ పాయింట్ల వరకు సుమారు 9 కిలోమీటర్ల దూరం ఉండగా, అధిక వర్షపాతం నమోదైన సమయాన ప్రవాహ మోతాదును అంచనా వేయడం, పరీవాహక ప్రజలకు అప్రమత్తం చేసయడంలో ఈ ఫ్లడ్‌గేజ్ పాయింట్లు కీలకంగా నిలుస్తాయని అధికారులు భావిస్తున్నారు. అయితే, హైడ్రాలజీ విభాగం ఆధ్వర్యాన పూర్తిస్థాయిలో సర్వే చేపట్టి శాశ్వతంగా ఫ్లడ్‌గేజ్ స్టేషన్లను ఏర్పాటుచేస్తే మరింత ఉపయోగంగా ఉంటుందనే భావనలో ఉన్నతాధికారులకు ప్రతిపాదించినట్లు తెలిసింది.

87శాతం బియ్యం పంపిణీ



ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని రేషన్ షాపుల ద్వారా ఇప్పటివరకు 87శాతం సన్న బియ్యం పంపిణీ పూర్తయిందని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ తెలిపారు. జిల్లాలో 4,15,904 కార్డులకు గాను 3,63,361కార్డుల ద్వారా(87శాతం) బియ్యం తీసుకెళ్లారని ఆయన వెల్లడించారు. బియ్యం పంపిణీ ఈనెల 30వ తేదీ వరకే ఉంటుందని, గడువు పొడిగించే అవకాశం లేనందున లబ్ధిదారులు త్వరగా తీసుకెళ్లాలని డీసీఎస్ఓ సూచించారు.

ఆరు గ్యారెంటీల అమలెక్కడ?

- దేశంలో మాయనిమచ్చగా మిగిలిన ఎమర్జెన్సీ
- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఎన్నికల ముందు అధికారమే పరమావధిగా ఇచ్చిన 66 హామీలు, ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఖమ్మంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో విధించిన ఎమర్జెన్సీ మాయని మచ్చగా మిగిలిపోయిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం తప్ప ప్రజల కోసం పనిచేసిన దాఖలాలు లేవని చెప్పారు. సామాజిక న్యాయంపై మాట్లాడే కాంగ్రెస్.. రాష్ట్రాన్ని 40 ఏళ్లు పాలించినా గిరిజనుడిని ముఖ్యమంత్రిని చేసిందా అన్ని ప్రశ్నించారు. ఇప్పుడు బీసీ, కులగణన అంటున్న కాంగ్రెస్ 50 ఏళ్ల పాలనలో ఇవన్నీ ఎందుకు చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కొట్లాడి, కష్టపడి తెలంగాణను తెచ్చుకుంటే రాష్ట్రాన్ని బాగు చేసే సత్తా అటు బీఆర్‌ఎస్, ఇటు కాంగ్రెస్‌కు లేదని తేలిపోయిందన్నారు. అప్పుల ఊబిలో నుంచి రాష్ట్రాన్ని కాపాడాలంటే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడమే మార్గమని ఈటల తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్ దుర్మార్గపు చర్య

కూసుమంచి: ఫోన్ ట్యాపింగ్ ద్వారా గత ప్రభుత్వం దుర్మార్గపు చర్యకు పాల్పడిందని మల్కాజిగిరి ఎంపీ, బీజేపీ జాతీయ కమిటీ సభ్యుడు ఈటల రాజేందర్ విమర్శించారు. కూసుమంచిలో నిర్వహించిన సంవిధాన్ హత్యా దివస్(రాజ్యాంగ హత్యా దినోత్సవం)లో పాల్గొన్న ఈటెల ఎమర్జెన్సీ కాలం నాటి ఫొటోలతో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించాక మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ బీఆర్‌ఎస్ దుర్మార్గానికి పరాకాష్ట అని... దీంతో ఏమీ సాధించలేకపోగా ప్రజల చేతుల్లో ఓటమి ఎదురైందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ సవరణలను ప్రజల శ్రేయస్సు కోసం చేపడితే కాంగ్రెస్ మాత్రం వందసార్లు వారి స్వార్థం కోసమే రాజ్యాంగాన్ని సవరించిందని విమర్శించారు. ఈ సమావేశాల్లో మాజీ ఎంపీ సీతారాం నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, నాయకులు తాండ్ర వినోద్‌రావు, దేవకి వాసుదేవరావు, పుల్లారావుయాదవ్, సన్నె ఉదయ్‌ప్రతాప్, గెంటేల విద్యాసాగర్, దొంగల సత్యనారాయణ, ఈ.వీ.రమేష్, పుణ్యవతి, నున్నా రవికుమార్, సంతోష్‌రెడ్డి, విజయారెడ్డి, శీలం పాపారావు, హట్యానాయక్, శ్యాంరాథోడ్, గడ్డం వెంకటేశ్వర్లు, రవిరాథోడ్, మల్లారెడ్డి, దాసరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల, పక్కన నాయకులు

ఆర్‌టీఓ కార్యాలయాల్లో ఏసీబీ భయం

ఖమ్మంక్రైం: రాష్ట్రంలోని రవాణా శాఖ కార్యాలయాల్లో గురువారం ఏకకాలంగా ఏసీబీ అధికారులు తనిఖీ చేపట్టారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల ద్వారా తెలియడంతో ఖమ్మంలోని జిల్లా రవాణాశాఖా కార్యాలయ ఉద్యోగులు బెంబేలెత్తిపోయారు. ఇక్కడ ఏసీబీ తనిఖీలు జరుగుతాయనే అనుమానంతో కార్యాలయ పరిసరాల్లోకి ఏజెంట్లు రాకుండా కట్టడి చేశారు. అంతేకాక ఏజెంట్లు సైతం తమ షాప్‌లకు తాళాలు వేసి వెళ్లిపోయారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రవాణా శాఖ కార్యాలయాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

విద్యతోనే పేదరికం దూరం

- జీపీల్లో మంచి వారిని ఎన్నుకుంటేనే గ్రామాల అభివృద్ధి
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం: చదువే జీవితాలను మారుస్తుందని, పేదరికాన్ని దూరం చేస్తుందనే విషయాన్ని గుర్తించిన తమ ప్రభుత్వం అందరికీ ప్రభుత్వ విద్యను అందుబాటులోకి తీసుకొస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రఘునాథపాలెం మండలంలోని పుతానితండా, సూర్య తండాల్లో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సమావేశాల్లో మంత్రి మాట్లాడుతూ ప్రతీ కుటుంబం ముందుచూపుతో ఆలోచించి పిల్లలను చదివించాలని తద్వారా పేదరికం నుంచి బయటపడడమేకాక సామాజిక, ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఇందుకోసం అన్ని వసతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని సూచించారు. కాగా, అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, పొలాలకు వెళ్లేందుకు మట్టి రోడ్ల నిర్మాణం చేపడుతుండగా, రైతులకు మేలు చేయాలనే లక్ష్యంతో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో మంచి నాయకులను ఎన్నుకుంటే ఆయా గ్రామాలు అభివృద్ధి బాట పడతాయని మంత్రి చెప్పారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ గ్రామపంచాయతీ భవనాలను ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగించుకుంటూ, ఒక గదిని గ్రంథాలయంగా మార్చుకోవాలని సూచించారు. అనంతరం పుతానితండా, సూర్యతండా గ్రామాల్లో 19మందికి మంత్రి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, ఆర్డీఓ నర్సింహారావు, డీపీఓ ఆశాలత, ఖమ్మం మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, డీఎల్‌పీఓ రాంబాబు, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఆత్మ, సొసైటీ చైర్మన్లు దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, తాతా రఘురాంతో పాటు నాయకులు మానుకొండ రాధాకిషోర్, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సాధు రమేష్‌రెడ్డి, మందడపు తిరుమలరావు, మారెళ్ల లక్ష్మణరావు, వాంకుడోత్ దీపక్, కొంటిముక్కల నాగేశ్వరరావు, మూడు చిన్నా, పీఆర్ డీఈ మహేష్, ఏఈ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



గురుకులంలో సీటు ఇప్పించాలని మంత్రి తుమ్మలను కోరుతున్న విద్యార్థిని

సార్... నేను చదువుకుంటా

చదువుకోవాలనే ఆసక్తి ఉంది సార్, నాకు గురుకులంలో ఇంటర్‌మీడియట్ సీటు ఇప్పించండి... అంటూ ఓ బాలిక పుతానీ తండా సమావేశంలో వేదికపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరింది. సదరు గిరిజన విద్యార్థిని ఇటీవల పదో తరగతి ఉత్తీర్ణత సాధించగా గురుకులంలో ఇంటర్ సీటు కోసం మంత్రి దృష్టికి తీసుకెళ్లింది. దీంతో స్పందించిన మంత్రి తుమ్మల చదువుపై ఆసక్తి ఉన్న వారికి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత తమపై ఉన్నందున తగిన చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలు ఇస్తానని బదులిచ్చారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీలో డీఎంఈ బృందం

వసతులు, బోధన సౌకర్యాలపై ఆరా

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పడి మూడేళ్లు పూర్తవగా డీఎంఈ డాక్టర్ నరేందర్ కుమార్, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర నేతృత్వంలోని బృందం గురువారం తనిఖీ చేసింది. గతంలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యాన కళాశాలలను ఆన్‌లైన్ విధానంలో పరిశీలించి నిర్వహణపై సూచనలు చేసేవారు. కానీ ఇటీవల అనుమతుల విషయంలో అభ్యంతరాలు వస్తుండడంతో రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుల నేతృత్వాన ప్రత్యక్షంగా పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో డీఎంఈ నేతృత్వాన బృందం కళాశాల, జిల్లా ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించింది. తరగతి గదులు, ల్యాబ్‌లు, అధ్యాపకుల వివరాలు ఆరా తీశాక అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అధ్యక్షతన అధికారులతో సమావేశమయ్యారు. కాలేజీలో కల్పించాల్సిన మరిన్ని వసతులపై సూచనలు చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు, వైస్‌ప్రిన్సిపాల్ సృజన, డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి, ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తరగతి గదిలో పరిశీలిస్తున్న బృందం సభ్యులు

రుణాలపై అవగాహన పెంచాలి

నాబార్డ్ సీజీఎం ఉదయ్ భాస్కర్

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలపై రైతులతో పాటు అన్నివర్గాల వారికి అవగాహన పెంపొందించాలని నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) ఉదయ్‌భాస్కర్ సూచించారు. ఖమ్మంలో గురువారం వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలపై ప్రాంతీయ(ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి నల్లగొండ జిల్లాల) స్థాయి బ్యాంకర్ల అవగాహన సదస్సు నాబార్డ్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈసదస్సులో సీజీఎం మాట్లాడుతూ రుణాలు అందుబాటులో ఉన్న విషయమై రైతులు, ప్రజలకు అవగాహన కల్పిస్తే సద్వినియోగం చేసుకుంటారని తెలిపారు. వివిధ రంగాల వారికి ప్రయోజనం కలిగేలా ప్రభుత్వాలు పథకాలను రూపొందించి సబ్సిడీ కల్పిస్తున్నాయని, కూరగాయల సాగు, సూక్ష్మ సేద్య పరికరాలు, డ్రోన్లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుకు రుణాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ విషయమై బ్యాంకర్లు విస్తృత అవగాహన కల్పించాలని సీజీఎం తెలిపారు. ఈ సమావేశంలో నాబార్డ్ జనరల్ మేనేజర్ గణపతి, డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీకాంత్, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రాజశేఖర్, నల్లగొండ డీసీసీబీ సీఈఓ శంకర్‌రావు, అధికారులు ఆర్య రవీంద్రన్, వినయ్‌కుమార్, సుజిత్‌కుమార్, రవీందర్ నాయక్, పాండురంగ పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న సీజీఎం ఉదయ్‌భాస్కర్

మెరుగైన సమాజ నిర్మాణమే లక్ష్యం

అవగాహన ర్యాలీలో సీపీ, అదనపు కలెక్టర్

ఖమ్మంక్రైం: మాదకద్రవ్యాలు లేని మెరుగైన సమాజాన్ని నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యంలో ప్రజలు పాలుపంచుకోవాలని పోలీసు కమిషనర్ సునీల్ దత్ సూచించారు.అంతర్జాతీయ మాదక ద్రవ్య, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత పురోగతికి అవరోధంగా నిలుస్తున్న మాదక ద్రవ్యాలను సమాజం నుండి సమూలంగా నిర్మూలించడానికి అందరూ సహకరించాలని కోరారు. యువతీ, యువకులు కూడా డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై ఉజ్వల భవిష్యత్‌ను కోల్పోవద్దని సూచించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ సరదా కోసం మొదలయ్యే దురలవాట్లు ఆ తర్వాత జీవితాన్ని అంధకారంలోకి నెడతాయని తెలిపారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా చదువు,భవిష్యత్‌పైనే దృష్టి సారించాలని సూచించారు. ఈ ర్యాలీలో అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, ఖమ్మం ఏసీపీ రమణమూర్తి, జిల్లా సంక్షేమాధికారి రాంగోపాల్‌రెడ్డి, డాక్టర్ నితీష్, సీఐలు భానుప్రకాష్, కరుణాకర్, స్వామి, సత్యనారాయణతో పాటు వివిధ కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ శ్రీజ, డీడబ్ల్యూఓ రాంగోపాల్‌రెడ్డి తదితరులు

క్లుప్తంగా

జాతీయ హ్యాండ్‌బాల్ టోర్నీలో ప్రతిభ



నందిని సంధ్య మీనాక్షి

ఖమ్మం స్పోర్ట్స్: జాతీయస్థాయి బాలికల జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. బీహార్ రాష్ట్రంలో ఈనెల 18నుంచి 22వ తేదీ వరకు టోర్నీ జరిగింది. రాష్ట్ర జట్టు తరఫున పాల్గొన్న జిల్లా క్రీడాకారులు మీనాక్షి, సంధ్య, నందిని జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించారని డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి తెలిపారు. క్రీడాకారులను డీవైఎస్‌ఓతో పాటు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.రఘునందన్, పీడీలు సీహెచ్.కృష్ణయ్య, పి.శ్రీనివాస్ అభినందించారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయం



సభ్యత్వ నమోదులో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

తల్లాడ: ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా తమ సంఘం కృషి చేస్తోందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ రంజాన్ తెలిపారు. మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం పర్యటించిన యూనియన్ నాయకులు సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా రంజాన్ మాట్లాడుతూ గత ఐదు దశాబ్దాలుగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ చిత్తశుద్ధితో పాటుపడుతోందన్నారు. కాగా, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డీ.ఎస్.నాగేశ్వరరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు షేక్ లాల్ సయ్యద్, టి.శ్రీనివాసరావుతో పాటు బి.ఇందుప్రియ, డి.రత్నకుమారి, కె.వెంకటేశ్వర్లు, షేక్ తసురున్నీసా, జి.మురళీకృష్ణ, జే.వీ.కిషోర్, చెన్నారావు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల

- ఐదో సెమిస్టర్‌లో 50.56, ఆరో సెమిస్టర్‌లో 50.16శాతం ఉత్తీర్ణత



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, అధికారులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించిన డిగ్రీ ఐదు, ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం విడుదల చేశారు. కేయూ క్యాంపస్‌లో వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రం, పరీక్షల విభాగం అధికారులతో కలిసి ఫలితాలను విడుదల చేయగా.. పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్ వివరాలు వెల్లడించారు. ఐదో సెమిస్టర్ పరీక్షలకు 13,963 మంది విద్యార్థులు హాజరు కాగా 7,059 మంది (50.56శాతం) ఉత్తీర్ణులయ్యారని, ఆరో సెమిస్టర్ పరీక్షల్లో 37,999 మందికి 19,060 (50.16శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. కాగా, ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు విద్యార్థులు పదిహేను రోజుల్లోగా ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు.

రక్తమోడుతున్న రోడ్లు

నిత్యం రహదారులు రక్తమోడుతున్నాయి. జిల్లాలోని ప్రధాన రహదారులపై రోజుకో ప్రమాదం సంభవిస్తోందంటే అతిశయోక్తి కాదు. బయటకు వెళ్లినవారు తిరిగి వచ్చేవరకూ ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని కుటుంబ సభ్యులు కలవరానికి గురవుతున్నారు. – ఖమ్మంక్రైం



మర్రిగూడెం వద్ద ఆర్టీసీ బస్సు - లారీ ఢీకొన్న దృశ్యం (ఫైల్)

- జిల్లాలో ప్రతీ ప్రధాన రహదారిపై రోజుకో ప్రమాదం
- గడిచిన ఐదున్నర నెలల్లో 150 మంది మృతి
- వందల సంఖ్యలో క్షతగాత్రులు

మితిమీరిన వేగం

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగడానికి ముఖ్య కారణాల్లో మితిమీరిన వేగం ఒకటని అధికారులు చెబుతున్నారు. వాహనదారులు వినియోగించే పెద్ద పెద్ద వాహనాల నుంచి ద్విచక్రవాహనాల వరకు ఒక స్పీడ్ లిమిటెడ్‌ను చూసుకోకుండా ఇష్టం వచ్చినట్లు నడపడంతో ఒకరినొకరు ఢీకొని ప్రాణాలు పోగొట్టుకోవడం లేదా క్షతగాత్రులుగా మారుతున్నారు.

ఈ రహదారులపై హడల్

జిల్లాలో ప్రధానమైన ఖమ్మం నుంచి కొత్తగూడెం, సత్తుపల్లి, వరంగల్ వెళ్లే ప్రధాన రహదారుల్లో ప్రయాణమంటే వాహనదారులు హడలిపోతున్నారు. నిత్యం కనీసం రెండు, మూడు అయినా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయడంలో అతిశయోక్తి లేదు. గ్రీన్‌ఫీల్డ్ హైవే అయితే తప్ప ఈ ప్రమాదాలు కొంత మేరకు తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా వైరా రోడ్డులోని కొణిజర్ల మండలంతో పాటు వైరా, తల్లాడ, కల్లూరు, తిరుమలాయపాలెం మండలాల్లో ప్రమాదాల సంఖ్య భారీగా పెరిగాయని, ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డు, రూరల్ పరిధిలోనూ ప్రమాదాలు ఎక్కువయ్యాయని చెబుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

జిల్లాలో వరుసగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత పోలీస్, రవాణా, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 30కి పైగా బ్లాక్ స్పాట్‌లు ఉన్నాయి. అయినా ఆ ప్రాంతంలో సూచిక బోర్డులు కాని, వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఎలాంటి ఏర్పాట్లు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కేవలం జరిమానాల కోసమే వాహనాల తనిఖీ చేయడం కాకుండా వాహనదారులు ఎలాంటి నిబంధనలు పాటించాలి, ప్రమాదాలు జరగడం వలన జరిగే ఇబ్బందులు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు చెబుతున్నారు.

ఐదున్నర నెలల్లో 150 మంది..

ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన 429 రోడ్డు ప్రమాదాల్లో 162 మంది మృతిచెందగా.. 431 మంది క్షతగాత్రులయ్యారు. అయితే, ఇవి అధికారిక రికార్డుల్లో నమోదు కాక.. రికార్డులకెక్కని ఘటనలు చాలానే ఉంటాయని చెబుతున్నారు.

ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన ప్రమాదాలు..

నెల	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
జనవరి	78	25	78
ఫిబ్రవరి	79	29	71
మార్చి	87	33	61
ఏప్రిల్	80	27	66
మే	50	28	80
జూన్	55	20	75

ఓవర్‌టేక్

జిల్లాలో ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ఓవర్ టేక్ కూడా ముఖ్య కారణమని అధికారులు చెబుతున్నారు. ముందు వెళ్తున్న వాహనాన్ని ఎలాగైనా దాటాలనే ఆతృతలో ఆ వాహనం సైడ్ ఇచ్చాడా లేదా అని ఆలోచించకుండా ఓవర్ టేక్ చేయడం.. ప్రాణాలు పోగొట్టుకోవడం లేదా కాళ్లు, చేతులు, విరిగి అవిటివారిగా మారిపోతుడడం పరిపాటిగా మారింది.

మితిమీరిన వేగం, ఓవర్‌టేక్ వల్లే....



జిల్లాలో వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ముఖ్యకారణం మితిమీరిన వేగం, ఓవర్‌టేక్ అని చెప్పవచ్చు. తనిఖీలు నిర్వహించేటప్పుడు ప్రతి ఒక్క వాహనదారుడికి రోడ్డు నిబంధనలు పాటించాలని చెబుతున్నాం. మీరు బాగుంటేనే మీ కుటుంబం బాగుంటుందని అవగాహన కల్పించినప్పుడు వింటున్నారు. కానీ రోడ్డు ఎక్కగానే మరిచిపోతుండడం ప్రమాదాలకు కారనమవుతోంది రోడ్లపై వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు తగ్గే అవకాశముంటుంది.

– వెంకటరమణ, జిల్లా రవాణాశాఖాధికారి

ఎర్రజెండాలన్నీ ఏకమైతే ప్రజలకు మేలు

- హామీల అమలులో కాంగ్రెస్ ఆలస్యం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, పక్కన నాయకులు

ఖమ్మంరూరల్: కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకమైతే ఢిల్లీలో ఎర్రకోటపై ఎర్రజెండాను ఎగురవేయొచ్చని, తద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. రూరల్ మండలంలోని పెదతండాలో గురువారం నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఒకే ఒకపార్టీ సీపీఐ మాత్రమేనని... ఆది నుంచి పేదలకు అండగా ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి పాటుపడుతోందన్నారు. కాగా, ప్రజలు ఇచ్చిన అధికారంతో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టులు చర్చలకు వస్తామని ప్రకటించినా ఆపరేషన్ కగార్ పేరుతో మారణకాండ చేయడం ఇందులో భాగమేనని తెలిపారు. అయితే, మావోయిస్టులు కూడా వనం వీడి జనంలోకి రావాలని కూనంనేని చెప్పారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా మావోయిస్టులకు మద్దతుగా నిలిచింది సీపీఐనేనని చెప్పారు. కాగా, కాంగ్రెస్ తప్పిదాలతోనే బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చిందని వెల్లడించిన ఆయన ఏపీలో అధికారం కోసం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ బీజేపీ వద్ద మోకరిల్లారని ఎద్దేవా చేశారు. రాజకీయ మేధావులు, విశ్లేషకులు, ప్రజలు కమ్యూనిస్టు పార్టీ ఆవశ్యకతను గుర్తెరిగి చెట్టు లాంటి కమ్యూనిస్టు పార్టీకి అండగా నిలవాలని సూచించారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర పాటు ఏమీ చేయకుండా ఆర్థిక లోటు పేరుతో హామీలను నెరవేర్చకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని కూనంనేని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు బాగం హేమంతరావు, ఎం.డీ.మౌలానా, దండి సురేష్, మిడకంటి చినవెంకటరెడ్డి, చెరుకుపల్లి భాస్కర్, పుచ్చకాయల సుధాకర్, ఉసికల రవికుమార్, సీతామహాలక్ష్మి, సిద్ధినేని కర్ణకుమార్, పి.చందర్‌రావు, శంకర్‌రెడ్డి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పశుసంవర్ధక, పశు వైద్యాధికారిగా పురంధర్



పురంధర్‌ను సత్కరిస్తున్న వైద్యాధికారులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా పశుసంవర్ధక, పశువైద్యాధికారిగా డాక్టర్ పురంధర్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన డిప్యూటీ డైరెక్టర్ హోదాలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈమేరకు పురంధర్‌కు జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి ఇక్కడే పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో ఇక్కడ పనిచేసిన కే.వీ.నారాయణ ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ చేయగా, ఏడీ డాక్టర్ బోడేపూడి శ్రీనివాసరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు పురంధర్ గురువారం బాధ్యతలు స్వీకరించగా వైద్యాధికారులు అనంతు హరీష్, ఉపేందర్, అశోక్, రాజు, సుబ్బారావు, జగ్గాలాల్, రాంజీ, శ్రీనివాస్‌నాయక్, నాగమణి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆఫ్‌టైప్ మొక్కలపై విచారణ

అశ్వారావుపేట: ఆయిల్‌ఫెడ్ నర్సరీల నుంచి సరఫరా అయిన మొక్కల్లో ఆఫ్‌టైప్ రావడంతో నష్టపోయినట్లు పలువురు రైతులు జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో నివేదిక కోరగా అశ్వారావుపేట మండలంలోని పలువురి తోటలను ఐఐఓపీఆర్ శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించి మొక్కల ఎదుగుదల, దిగుబడిపై అధ్యయనం చేశారు. శాస్త్రవేత్తలు ఎంవీ.ప్రసాద్, రామచంద్రుడు, బి.కళ్యాణ్, విజయకృష్ణ పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి

కల్లూరురూరల్: మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలు అమలుచేస్తోందని జిల్లా మత్స్య శాఖ అధికారి జి.శివప్రసాద్ తెలిపారు. కల్లూరు మండలం పెద్దకోరుకొండిలో గురువారం నిర్వహించిన దళిత మత్స్య పారిశ్రామిక సహకార సొసైటీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 30వ తేదీతో సొసైటీ గడువు ముగియనున్న నేపథ్యాన సమావేశం ఏర్పాటు చేసి ఏడాది పాటు పొడిగించగా.. 259 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ సొసైటీ పరిధిలోకి వెంపటి చిన్నచెరువు, చింతల చెరువు, పెద్దకోరుకొండిలోని గంగదేవునికుంట, బండి కుంట, పెద్దచెరువు, వెన్నవల్లిలోని కోమటికుంట, ఊరచెరువు, నల్లచెరువు, తెలగవరంలోని తెలకవరం చెరువులు వస్తాయి. కాగా, త్వరలోనే సభ్యులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు అధికారి శివప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో తోటపల్లి వసంతరావు, రామకృష్ణ, మహేష్, మురళి, విష్ణు, గొర్రెపాటి రవికృష్ణ, పెద్ద సైదులు, మత్స్య శాఖ ఉద్యోగి బెనర్జీబాబు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఖమ్మం లీగల్: చదువు, ఉద్యోగాలపై దృష్టిసారించాల్సిన వయస్సులో మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే భవిష్యత్ కోల్పోవాల్సి వస్తుందని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే.వీ.చంద్రశేఖరరావు యువతకు సూచించారు. మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. యువతకు చెడు అలవాట్లు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండడమే కాక వీటితో కలిగే అనర్థాలపై ఇతరులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవా సంస్థ సభ్యులు సంధ్యారాణి, మందడపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తుల వస్తువుల ప్రదర్శన, అమ్మకాలు

ఖమ్మంమయూరిసెంటర్: బోనాల ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్ బండ్, హెచ్‌ఎండీఏ గ్రౌండ్‌లో బీసీ చేతివృత్తుల వస్తువుల ప్రదర్శన, అమ్మకాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జి.జ్యోతి తెలిపారు. ఈనెల 25 నుంచి 29 వరకు జరిగే ఎగ్జిబిషన్‌లో కుమ్మరి, మేదరి, నేత/చేనేత, వడ్రంగి, కమ్మరి, పూసల వెనుకబడిన తరగతుల చేతివృత్తుల వారు వస్తువులు ప్రదర్శించవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

టింబర్ డిపోలో డీఎఫ్ఓ తనిఖీ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని అటవీశాఖ టింబర్ డిపోను జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ గురువారం తనిఖీ చేశారు. డిపో భవనంతో పాటు పట్టుబడి తుప్పుపట్టిన కలప, వాహనాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అలాగే, టింబర్ డిపో ప్రాంగణంలో నిర్మిస్తున్న మినీ కమ్యూనిటీ హాల్ వివరాలు ఆరా తీశారు. అనంతరం అటవీ డివిజన్ కార్యాలయంలో రికార్డులను డీఎఫ్ఓ తనిఖీ చేశారు. ఎఫ్‌డీఓ వాడపల్లి మంజుల, రేంజర్ స్నేహలత, డీఆర్‌ఓ మంగపతి, ఎఫ్ఎస్ఓ నర్సింహా, ఎఫ్‌బీఓలు శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం క్రాస్ వద్ద గురువారం రాత్రి ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో గుర్తుతెలియని ఓ వ్యక్తి(30) మృతి చెందాడు. ఆరెంపుల వైపు నుంచి ద్విచక్రవాహనంపై సదరు వ్యక్తి ఖమ్మం వైపు వస్తుండగా.. ఖమ్మం నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

గోవిందాపురంలో మెడికల్‌షాపు దగ్ధం

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్)లో కల్యాణపు కిరణ్‌కుమార్‌కు చెందిన శ్రీ వెంకట గాయత్రీ మెడికల్ స్టోర్ బుధవారం అర్ధరాత్రి దగ్ధమైంది. అయితే, తానంటే గిట్టని వారే నిప్పు పెట్టి ఉంటారని కిరణ్ చేసిన ఫిర్యాదుతో సీఐ మధుబాబు, ఎస్ఐ పొదిలి వెంకన్న గురువారం పరిశీలించి వివరాలు ఆరా తీశారు. అలాగే, సీపీఎం నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, పొన్నం వెంకటేశ్వరావు, చింతలచెర్వు కోటేశ్వరావు, కిలారు సురేష్ కూడా షాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పోతినేని మాట్లాడుతూ కొన్నాళ్ల క్రితం సీపీఎం కార్యకర్త ఎర్రబోయిన నాగేశ్వరావు హత్యకు గురికాగా, ఈ కేసులో కిరణ్‌కుమార్ సాక్షిగా ఉండడంతోనే దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని పేర్కొన్నారు. ఈమేరకు పోలీసులు నిందితులను గుర్తించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.



షాప్‌లో కాలిపోయిన ఫర్నిచర్



వేతన.. వెతలు

- జీపీ కార్మికులకు మూడు నెలలుగా అందని జీతం
- జిల్లాలో 2వేల మంది ఎదురుచూపులు
- నేడు హైదరాబాద్‌లో ఆందోళనకు పయనం

నేలకొండపల్లి: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణలోనే కాక ఇతర అంశాల్లో కీలకపాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్మికులకు గత మూడు నెలలుగా జీతాలు అందటం లేదు. దీంతో కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నారు. గ్రామపంచాయతీల్లో కార్మికులే కాక వాటర్ మెన్లు, ట్రాక్టర్ డ్రైవర్లు, ఎలక్ట్రీషియన్లు, కారోబార్ల పరిస్థితి ఇదే విధంగా ఉంది. అసలే చాలీచాలనీ వేతనాలతో బతుకుబండి లాగిస్తుండగా ఆ వేతనాలు కూడా నెలల తరబడి పెండింగ్ పెట్టడం సరికాదని వాపోతున్నారు. ఈనేపథ్యాన ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా శుక్రవారం హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం ముట్టడికి వెళ్లేందుకు జిల్లా కార్మికులు సిద్ధమవుతున్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో కీలకం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్, పల్లె ప్రగతి తదితర కార్యక్రమాలలో కార్మికులే కీలకంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో 2 వేల మంది కార్మికులు పనిచేస్తుండగా వీరికి నెలనెలా రూ.9,500 వేతనం చెల్లిస్తున్నారు. పెరిగిన ఖర్చుల రీత్యా వేతనాలు పెంచాలంటూ డిమాండ్ చేస్తుండగా ఫలితం లేకపోగా ఆ వేతనం కూడా సక్రమంగా చెల్లించకపోవడం వారిని ఆవేదనకు గురిచేస్తోంది.



నేలకొండపల్లిలో మురుగు తొలగిస్తున్న కార్మికులు

ఉద్యోగ భద్రత కరువు

ఉద్యోగ భద్రత లేక ప్రతీరోజు బిక్కుబిక్కుమంటూ పనిచేయాల్సి వస్తోందని కార్మికులు వాపోతున్నారు. కనీసం వేతనం రూ.20 వేలు ప్రతినెలా ఎస్టీఓ ద్వారా చెల్లించడమే కాక ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా అమలుచేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం శుక్రవారం హైదరాబాద్‌లో జరగనున్న ఆందోళనలో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్(టీయూసీఐ) నాయకులు కోరారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అమర్లపూడి అప్పారావు, పగిడికత్తుల రాందాస్ ఆధ్వర్యాన జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రజాపాలన పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ కార్మికులను సంక్షేమాన్ని పట్టించుకోకపోగా వేతనాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. నెలల తరబడి వేతనాలు పెండింగ్ ఉండడంతో ఇబ్బంది పడుతున్నందున వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మీగడ సైదులు, జోగా నాగేశ్వరరావు, కత్తుల భిక్షం, రమేష్, గోపి, భాష, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భారంగా కుటుంబ పోషణ



ప్రతినెలా జీతాలు రాక కుటుంబ పోషణ భారంగా మారింది. ఇకనైనా అధికారులు స్పందించి కనీస వేతనం రూ.20 వేలుగా నిర్ణయించి పెండింగ్ లేకుండా చెల్లించాలి. అలాగే, బీమా కల్పించడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలి.

– బొడ్డు అంజనేయులు, మల్టీపర్పస్ వర్కర్, కోనాయిగూడెం

చిత్తశుద్ధి లేని ప్రభుత్వం



పంచాయతీ కార్మికులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువైంది. ఇచ్చే అరకొర వేతనం కూడా నెలల తరబడి పెండింగ్ పెట్టడం సరికాదు. ఇకనైనా కార్మికులకు ప్రతినెలా ఎస్టీఓ ద్వారా జీతం చెల్లించాలి. ఇందుకు ప్రత్యేక గ్రాంట్ మంజూరు చేయాలి.

– టి.విష్ణు, పంచాయతీ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు